క్లుప్తంగా

భూములు ముంపునకు గురికాకుండా చూడాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: గుండ్లకమ్మ ప్రాజెక్టు చివరి భూములకు నీరందక పనులు ఆగిపోయిన చోట పొలాలు ముంపునకు గురవుతున్నాయని గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘ ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి తెలిపారు. గుండ్లకమ్మ కాలువల ముంపునకు గురవుతున్న పొలాల రైతులతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సుజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చుండూరి రంగారావు, షేక్ మాబు, జయంత్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న తహసీల్దార్, ఎస్సై

చీమకుర్తి: మండలంలోని పిడతలపూడి గ్రామంలో స్థానిక భక్తుల ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని సోమవారం ఘనంగా ప్రతిష్ఠించారు. తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు, ఎస్సై రామిరెడ్డి, చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు గొర్రెముచ్చు శ్రీనివాసరావు, తుమ్మ అంజయ్య, తుమ్మ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపు నిష్పక్షపాతంగా జరగాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు



అల్లూరులో ఓట్ల జాబితాను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

అల్లూరు (కొత్తపట్నం): ఓటర్ల తొలగింపు నిష్పక్షపాతంగా జరగాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, మరణించిన వారి ఓట్లు ఉండటంతో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. అల్లూరు బూత్ నంబర్ 232లో ఎస్సీకాలనీ, వైశ్యాబజారు, యాదవపాలెం, బూత్ నంబర్ 234లో పడమరబజారు, రామలింగారెడ్డి యానాదికాలనీ, బూత్ నంబర్ 235లో సాయినగర్, పడమరబజారు కాలనీల్లో ఇంటింటికి తిరిగి ఓట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్ల తొలగింపుపై బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రాజకీయ నాయకుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని బీఎల్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ బీవీ రమణారావు, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, సూపర్‌వైజర్ ఐపీ రామారావు, బీఎల్వో కె.ప్రవీణ్‌బాబు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో చెత్త వేయొద్దు



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో కాలువలో పూడిక తీయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగర ప్రజలు చెత్తను మురుగు కాలువల్లో వేయవద్దని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను నగర ప్రజలు మురుగు కాలువల్లో పడేస్తున్నారని, దానివలన మురుగునీరు సజావుగా ప్రవహించదని అన్నారు. భారీ వర్షం కురిసిన సమయంలో మురుగు కాలువల్లో నీరు ప్రవహించక రోడ్లమీదకు వస్తోందని తెలిపారు. పలుచోట్ల కాలువల్లో పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి కాలువల్లో పూడిక తీయించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చియ్య, ఇన్‌స్పెక్టర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కాలువ పనులను కమిషనర్ పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని స్పష్టం చేశారు. అనంతరం ఇస్లాంపేట వద్ద కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఇళ్ల ముందు కాలువలపై వేసే సిమెంట్ మూతలను అప్పుడప్పుడూ తొలగించి మళ్లీ పెట్టుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు.

స్పందనకు 26 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నగర ప్రజల నుంచి వివిధ సమస్యలపై 26 అర్జీలు అందాయి. వాటిలో ప్రధానంగా టిడ్కో ఇళ్లకు సంబంధించి 19 అర్జీలు వచ్చాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 2 అర్జీలు, శానిటేషన్ విభాగానికి సంబంధించి 3 అర్జీలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి 1, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 1 చొప్పున అర్జీలు వచ్చాయని కమిషనర్ వెల్లడించారు. వాటిని ఆయా విభాగాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. నిర్ణీత గడువు లోగా స్పందన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీల్లో ఘనంగా ఆహ్వాన వేడుకలు



క్విస్ కాలేజీలో పాల్గొన్న ఇస్రో సైంటిస్ట్ సుబ్బారావు



రైజ్ కాలేజీలో మాట్లాడుతున్న శిద్దా వెంకటేశ్వరరావు

ఒంగోలు: స్థానిక క్విస్, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఆహ్వాన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. క్విస్ కాలేజీలో ఇస్రో శాస్త్రవేత్త బి.సుబ్బారావు, కాలేజీ యాజమాన్య కమిటీ ఉపాధ్యక్షుడు చెంచు ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కలలను సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఎస్.సూర్య కళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.గాయత్రి, మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రైజ్ కాలేజీలో చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు, రైజ్ గ్రూప్ కార్యనిర్వాహక చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. రైజ్ కోశాధికారి శిద్దా భరత్, రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏవీ భాస్కరరావు, డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొత్తపట్నం ఉప సర్పంచ్‌గా గోపి



కొత్తపట్నం: మండలంలోని కొత్తపట్నం పంచాయతీ ఉప సర్పంచ్‌గా పురిణి గోపి ఎన్నికయ్యారు. కొత్తపట్నం పంచాయతీ 6వ వార్డు సభ్యునిగా గెలిచి ఉపసర్పంచ్‌గా వ్యవహరిస్తున్న రామలింగం సురేష్ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. గత నెలలో ఉప ఎన్నికలు నిర్వహించగా, సురేష్ భార్య రామలింగం ఆదిలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉపసర్పంచ్ ఎన్నిక జరిగింది. ఎనిమిది మంది సీపీఐ మద్దతు వార్డు మెంబర్లు ఉండటంతో ఉప సర్పంచ్‌గా పురిణి గోపిని ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసరావు గోపితో ప్రమాణస్వీకారం చేయించారు.

చిన్న పిల్లలకు నెల రోజులు ఉచిత వైద్య సేవలు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని గుంటూరు రోడ్డులో గల శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో చిన్నపిల్లల విభాగాన్ని ప్రారంభించిన సందర్భంగా నెల రోజుల పాటు చిన్న పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ సోమవారం తెలిపారు. హైదరాబాదులోని అపోలో హాస్పిటల్స్, ప్రఖ్యాత చిన్నపిల్లల హాస్పిటల్ నియోబీబీసీలో పనిచేసి నియోనేటాలజీలో ఫెలోషిప్‌చేసి పురిటి బిడ్డలు, చిన్న పిల్లల్లో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు మీద ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాక్టరు హరికృష్ణప్రసాద్ యర్రు చిన్న పిల్లల విభాగం వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు చిన్న పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఉచిత ఓపీతో పాటు పరీక్షలను కూడా రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. అలాగే, చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధులు, సీజనల్ వ్యాధులపై సందేహాలకు 81848 28282 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలకు ప్రభుత్వం పెద్దపీట



పోతవరంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందజేసి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం పోతవరం గ్రామంలో సర్పంచ్ శీలం రేణుక సురేష్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అవ్వాతాతలు, వితంతువులకు తాను ఇచ్చిన మాట నెరవేరుస్తూ క్రమం తప్పకుండా పింఛన్ అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఉత్తమ సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయ అవార్డును ఎం.వెంకటేశ్వర్లు అందుకున్నారు. నగరంలోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయునిగా వెంకటేశ్వర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయనను ప్రైవేటు ఉపాధ్యాయ ఆర్గనైజేషన్ వారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయగా, గుంటూరులోని ఏసీ కాలేజీలో సోమవారం ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు చేతులమీదుగా అవార్డు స్వీకరించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

కొత్తపట్నం: మండుతున్న నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలు డిమాండ్లపై సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు సాగుచేస్తున్న అర్హులైన పేదలను గుర్తించి పట్టాలివ్వాలని సూచించారు. ఉపాధి కూలీలకు పని కల్పించాలని, రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్యాస్, డీజిల్ ధర రోజురోజుకూ పెరిగిపోతోందని, వెంటనే తగ్గించాలని కోరారు. ఉపాధి పథకం నిధులు కత్తిరిస్తున్నారని, కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచుతున్నారని దుయ్యబట్టారు. ఆక్వా హేచరీలలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని, ఈతముక్కల, సోమర్పాడులో సాగు చేస్తున్న భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

గణిత విద్య సేవకుడు.. వెంకారెడ్డి

ఒంగోలు: గణిత విద్య సేవకుడు తాటిపర్తి వెంకారెడ్డి అని విద్యాశాఖ రిటైర్డ్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ తాటిపర్తి గోపాల్‌రెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్, విద్యావంతుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవన్‌లో సోమవారం నిర్వహించిన తాటిపర్తి వెంకారెడ్డి జయంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

మాగుంట విద్యా సంస్థల గౌరవ సలహాదారునిగా వెంకారెడ్డి చేసిన సేవలను వివరించారు. సీనియర్ గణిత శాస్త్ర అధ్యాపకుడు రావూరి జోసెఫ్ మాట్లాడుతూ నిత్య జీవితంలో గణిత శాస్త్ర అవసరం అనే అంశం మీద వెంకారెడ్డి స్మారక ఉపన్యాసం చేశారు. గణితంలో రకరకాల పోటీ పరీక్షలకు వెంకారెడ్డి ఆద్యుడని, గణిత ఒలంపియాడ్ వంటి పరీక్షలు ఆయనే వెలుగులోకి తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించగా, కోశాధికారి ఎ.బ్రహ్మయ్య, కార్యదర్శి జాన్‌శామ్యూల్, కార్యవర్గసభ్యుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నాగార్పమ్మ తల్లికి జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



రజానగరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు స్వాగతం పలుకుతున్న మహిళలు



పూజలు చేస్తున్న మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ, జెడ్పీటీసీ మారం

తాళ్లూరు (ముండ్లమూరు): తాళ్లూరు మండలంలోని రజానగరంలో నాగార్పమ్మతల్లి నెల పొంగళ్ల కార్యక్రమంలో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వలి, నాయకులు పులి వికాస్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మద్దిశెట్టి రవీంద్ర పూజలు...

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర నాగార్పమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల పొంగళ్ల కార్యక్రమంలో భాగంగా ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, సర్పంచ్ వలి, ఎంపీటీసీ మేడగం వెంకటరామిరెడ్డి, నాయకులు పులి వీరాస్వామి, మేడగం శ్రీనివాసరెడ్డి, ఉప్పుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తలెత్తుకు తిరిగేలా సంక్షేమ పాలన

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
● సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు

కొనకనమిట్ల: కులమతాలు, రాజకీయాలు, అవినీతికి తావు లేకుండా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తూ, వైఎస్సార్ సీపీ నాయకులు తలెత్తుకుని తిరిగే పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చినమనగుండం గ్రామంలో ఆయన మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ వడ్లమూడి మురళీమోహన్, ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులతో కలిసి నూతన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. వారికి స్థానిక నాయకులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు 1.36 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించిందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన నినాదంతో ఒకే చోట సమస్యలు పరిష్కారమయ్యేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, జేఈ మస్తాన్‌వలి, పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి, వైద్యాధికారి నరేంద్ర, సచివాలయ కార్యదర్శి నాగార్జునరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సీసీకేఆర్ శ్రీను, స్థానిక పార్టీ నాయకులు వడ్లమూడి యోగయ్య, వడ్లమూడి బ్రహ్మారావు, టంగుటూరి వెంకటరావు, మర్రి వెంకటేశ్వర్లు, ఈర్ల దుర్గారావు, బిజ్జాల వెంకటేశ్వర్లు, బిలామ్, జాన్, కోలా కొండయ్య, జీవయ్య, ఏబు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో పెరిగిన ధరలు

ఒంగోలు టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాల ధరలు నింగినంటాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వైఎస్ సిద్దయ్య విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య ప్రసంగిస్తూ మోదీ పాలనలో రూ.450 ఉన్న గ్యాస్ ధర అమాంతం పెరిగి రూ.1,150కు చేరిందని, పెట్రోలు రూ.60 నుంచి రూ.112కు, డీజిల్ రూ.44 నుంచి రూ.100కు పెరిగాయని చెప్పారు. నెలవారీ సరుకుల ధరలు రెండొందల శాతం పెరిగాయన్నారు. తాను అధికారంలోకి రాగానే రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ చేసిన వాగ్దానం నీటిమీద రాతగా మారిందన్నారు. దేశంలో 65 శాతం మంది యువకులు నిరుద్యోగులుగా రోడ్ల మీద తిరుగుతున్నారని చెప్పారు. బీజేపీ తెచ్చిన విద్యుత్ సంస్కరణలు దేశ ప్రజల నడ్డివిరుస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అన్నారు. వెంటనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, జి.ఆదిలక్ష్మి, పి.కల్పన, తంబి శ్రీనివాసరావు, మహేష్, భావనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నా భూమి-నా దేశం మట్టి సేకరించిన బీజేపీ నాయకులు



మట్టి స్వీకరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు

ఒంగోలు: నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి కొప్పోలు, రాజీవ్ కాలనీ, తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించి ప్రజల నుంచి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన మేరీ మాటి-మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాంతం నుంచి మట్టి సేకరించి ఢిల్లీ పంపిస్తున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరులో పాల్గొన్న, అమరులైన దేశ నాయకులను స్మరించుకుంటూ భావితరాలకు వారి త్యాగాలను తెలియజేసే విధంగా కేంద్రం స్ఫూర్తి నింపుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ శెగ్గెం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.